క్లుప్తంగా

సుందరంగా శ్మశానవాటిక



యలమంచిలిలో సుందరంగా తీర్చిదిద్దిన శ్మశానవాటిక

మునగపాక: స్థానిక పెంటకోట వారి శ్మశానవాటికను సుందరంగా తీర్చిదిద్దారు. చెరువు కాలువ ప్రాంతంలో ఉన్న శ్మశాన వాటిక అధ్వానంగా ఉండడంతో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పాలకవర్గ సభ్యులు ముందుకొచ్చి సౌకర్యాలు కల్పించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో షెడ్, అంతర్గత రహదారులను నిర్మించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సలహాలు,సూచనలతో పాటు పెద్దల సహకారంతో శ్మశానవాటికను అభివృద్ధి చేసినట్లు సర్పంచ్ అప్పారావు తెలిపారు.

వేతన కార్యదర్శుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి సూర్యారావు

మునగపాక: వేతన కార్యదర్శుల వేతనాలు పెంచాలని వేతన కార్యదర్శుల సంఘం జిల్లా కార్యదర్శి సూర్యారావు డిమాండ్ చేశారు. మండలంలోని ముసిలితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అచ్యుతాపురం, చోడవరం, అనకాపల్లి జోన్ల పరిధిలోని వేతన కార్యదర్శులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖడెయిరీ యాజమాన్యం ఇటీవల వేతన కార్యదర్శుల వేతనాన్ని 15శాతం పెంచుతామని హామీ ఇచ్చిందని, అయితే 20 శాతానికి పెంచేలా చూడాలన్నారు. పాలసంఘాల్లో పనిచేసే ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలని ఆయన కోరారు. యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ ప్రతినిధులు కనకారావు, ప్రసాద్, సన్యాసినాయుడు, బొడ్డేడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పండగలు



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక–వాడ్రాపల్లి సరిహద్దులోని సత్తెమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా మే నెలలో పండగను నిర్వహించడం ఆనవాయితీ. పండగ సందర్భంగా పలువురు భక్తులు, మునగపాక నుంచి వాడ్రాపల్లి వైపు రాకపోకలు సాగించేవారు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మునగపాకలో కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు.

భయపెడుతున్న శిథిల కల్వర్టు



శిథిలమైన ఏలేరు కాలువపై ఎ.శరభవరం వద్ద నిర్మించిన కల్వర్టు

నాతవరం: నర్సీపట్నం తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డులో ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువ కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నంలో పరిశ్రమలకు ప్రజలు తాగునీటికి ఏలేరు కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నారు. నాతవరం మండలంలో 25 కిలోమీటర్లు మేర ఏలేరు కాలువ ఉంది. ఎంబీపట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం గ్రామం వద్ద ఏలేరు కాలువకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగించేందుకు కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టు శిథిలం కావడంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి శిథిలమైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా తలుపులమ్మ ఒడ్డు పండగ

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామ దేవత తలుపులమ్మ అమ్మవారి ఒడ్డు పండగ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరిపారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించేందుకు భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, గండి సత్యం, సిరపరపు నాయుడుబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పంటలకు సంజీవని
ఫాం పాండ్స్

పశువుల దాహార్తి తీరుస్తున్న నీటి తొట్టెలు • ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం



ఉద్దండపురంలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న ఫాం పాండ్

నక్కపల్లి: వేసవితోపాటు సాధారణ రోజుల్లో కూడా పంటలను నీటి ఎద్దడినుంచి కాపాడేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వర్షపునీరు వృథాగా పోకుండా వాటిని పంట పొలాలకు ఉపయోగించుకునే కార్యక్రమాన్ని చేపట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల్లోనే రైతులు నీటిని నిల్వచేసుకుని, పంటలు ఎండిపోకుండా కాపాడుకునేలా చర్యలు తీసుకుంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రైతుల భూముల్లో 'పంట సంజీవని' పేరుతో ఫాం పాండ్స్‌ను నిర్మిస్తోంది. ఆసక్తి కలిగిన రైతుల పొలాల్లో సుమారు రూ.35 వేల నుంచి రూ.60 వేల విలువైన పనులను చేయించడానికి నిర్ణయించింది. రెండు రకాల సైజుల్లో ఈ పాండ్స్‌ను నిర్మిస్తున్నట్టు అధికారులు తెలిపారు. రైతులు తమ పొలాల్లో 2 సెంట్ల స్థలాన్ని చూపిస్తే చాలు ఈ పాండ్స్‌ను ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది నిర్మిస్తారు. 9 మీటర్ల పొడవు,11 మీటర్ల వెడల్పు,2 మీటర్ల లోతు అలాగే 20 మీటర్ల పొడవు,20 మీటర్ల వెడల్పు2 మీటర్ల లోతుతో ఈ పాండ్స్‌ను నిర్మిస్తున్నారు. నక్కపల్లి మండలంలో 211 ఫాం పాండ్స్‌నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు 100 ఫాం పాండ్స్ నిర్మించారు.

వేసవిలో మేలు

వేసవిలో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో వ్యవసాయ బావుల్లో సైతం అడుగంటి పోయి నీటి ఎద్దడి ఏర్పడుతోంది. ప్రధానంగా కొబ్బరి, మామిడి, అరటి, తమల పాకులు, కూరగాయలు ఉద్యాన వన పంటలకు వేసవికాలంలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ బోర్లు ఉన్నప్పటికీ విద్యుత్ కోతలు, సరిపడా నీరు లేకపోవడం వంటి కారణాలతో పంటలకు నీరు అందించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి అత్యవసర సమయంలో వర్షపునీటిని నిల్వ చేసే ఫాం పాండ్స్ వల్ల కొంతమేర ఉపశమనం పొందవచ్చని, పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఉద్దండపురం, చీడిక,దోసలపాడు, డీఎల్‌పురం, జానకయ్యపేట, అమలాపురం, వేంపాడు, నెల్లిపూడి తదితర గ్రామాల్లో పాండ్స్ నిర్మాణాలు పూర్తి చేయడంతో వాడుకలోకి వచ్చాయి.

అదనపు ఆదాయం

ఫాం పాండ్స్ వల్ల నేలలో తేమ శాతాన్ని పెంచుకునే అవకాశం కూడా ఉంటుంది. పాండ్స్ గట్లపై కూరగాయల పెంపకం కూడా చేపట్టవచ్చు. ఫలసాయం ఇచ్చే వితనాలు కూడా జల్లుకోవచ్చు. నీటిని నిల్వ ఉంచి వివిధ రకాల పంటలకు ఉపయోగంచుకోవడంతోపాటు అనుబంధ పంటలను కూడా వేసి అదనంగా ఆదాయం పొందే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకం కూలీలకు సైతం పూర్తి స్థాయిలో స్థానికంగానే పనులు కల్పించడం జరుగుతోంది.



డీఎల్‌పురంలో నిర్మించిన ఫాం పాండ్‌లో చేరిన వర్షపునీరు

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకానికి రైతులనుంచి విశేష స్పందన వస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయగ్రామీణ ఉపాధి హామీపథకంలో ఈ ఫాంపాండ్స్‌ను నిర్మిస్తున్నాం. ఇప్పటికే పలుగ్రామాల్లో ఆసక్తి చూపిన రైతుల పొలాల్లో వీటిని నిర్మించాం. రైతులు రెండుసెంట్ల స్థలం చూపిస్తే చాలు వారు కోరిన సైజుల్లో పాండ్స్‌ను నిర్మిస్తారు.రైతులకు పైసా ఖర్చులేకుండానే నీటిని నిల్వ చేసుకునే వెసులు బాటు కల్పిస్తున్నాం.పశువులకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు నీటి తొట్టెలను కూడా మంజూరు చేస్తున్నాం.ఈరెండు పథకాలపై గ్రామాల్లో రైతులకు విస్తృతంగా అవగాహనకల్పిస్తున్నాం. వీటిని సద్వినియోగం చేసుకొని, పంటలను, పాడి పశువులను కాపాడుకోవాలి. ఆసక్తి కలిగిన రైతులు ఎన్‌ఆర్‌ఈజీఎస్, పశుసంవర్ధకశాఖ కార్యాలయాల్లో సంప్రదించాలి.

–సీతారామరాజు, ఎంపీడీవో, నక్కపల్లి

పశువులకు నీటి తొట్టెలు

వేసవికాలంలో పశువులకు నీటి కొరత తీవ్రంగా ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కూడా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో పశువులకు నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. 5.15 మీటర్ల పొడవు,2.15 మీటర్ల వెడల్పుతో సుమారు రూ.35వేల వ్యయంతో విలువైన నీటితొట్టెలను నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. నీరు లభ్యమయ్యే ప్రదేశంలో వీటిని నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు మండలంలో 12 నీటి తొట్టెలను నిర్మించారు. పశుసంవర్ధక శాఖ అధికారుల పర్యవేక్షణ, వారి ఆమోదంతో వీటిని నిర్మిస్తున్నారు. ఆసక్తి కలిగిన పాడిరైతులు ఎన్‌ఆర్‌ఈజీఎస్, పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదిస్తే పూర్తి వివరాలతోపాటు, అనుమతులు మంజూరు చేస్తారని అధికారులు తెలిపారు.



జానకయ్యపేటలో పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టె

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



పరదేశీనాయుడు దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మునగపాక గ్రామానికి చెందిన శరగడం పరదేశీనాయుడు మండల ఇంజినీరుగా సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేశారు. ఆదివారం స్థానిక రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో అభినందన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పరదేశీనాయుడు ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పదవీ విరమణ చేసేంతవరకు రిమార్క్ లేకుండా అంకితభావంతో విధులు నిర్వహించారన్నారు. ప్రజల్లో భక్తి భావం పెంపొందించడంలో పరదేశీనాయుడు గుర్తింపు పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, దాడి ముసిలినాయుడు,మొల్లేటి సత్యనారాయణ,కాండ్రేగుల జగ్గారావు, బీశెట్టి లక్ష్మణరావు, అలంక ప్రకాశరావు, పరదేశీనాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

యలమంచిలి రూరల్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకోసం యలమంచిలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి అంబేడ్కర్ గురుకులాలను అధికారులు ఎంపిక చేశారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం,మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

అమ్మే మన మొదటి గురువు



చినదొడ్డిగల్లులో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు చంద్రరావు

పాయకరావుపేట: అమ్మే మన తొలిగురువని విశ్రాంత ఉద్యోగి ఎస్.టి.సీతారామమూర్తి తెలిపారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం పుస్తక పఠనం తదితర కార్యక్రమాలతో పాటు మదర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతారామమూర్తి అమ్మ గొప్పతనం గురించి వివరించారు. అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో అమ్మ మీద వ్యాసం రాయించి, పాటలు, భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. ఈ తరగతులకు 20 మంది హాజరైనట్టు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణ్‌రావు తెలిపారు.

నక్కపల్లి: వేసవి శిబిరంలో భాగంగా చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక సమీక్ష నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ పర్యవేక్షణలో 15 రోజులుగా వేసవి శిబిరం కొనసాగుతోంది. 30 మందికి పైగా విద్యార్థులు ఈ శిబిరానికి హాజరవుతున్నారు.పుస్తకపఠనం, చిత్రలేఖనం, వ్యాసరచన, స్పోకెన్ ఇంగ్లిషు నేర్పిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం పుస్తక సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో వారికి నచ్చిన పుస్తకం పేరు, రచయిత పేరు,పుస్తకంలో సారాంశం మొదలగు వివరాలను చదివించినట్టు జనార్దన్ తెలిపారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు.



పాయకరావుపేట గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థులు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయుడు పొలమరశెట్టి చంద్రరావు తెలిపారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలంటే ఇష్టపడి, కష్టపడడం ఒక్కటే మార్గమన్నారు. దేశభక్తిని చాటుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, బి.ఉమామహేశ్వరరావు,ఆళ్ల మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న అభయాంజనేయ స్వామి

ఎస్.రాయవరం: గెడ్డపాలెంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి రావడంతో రద్దీ ఏర్పడింది. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

దేశ సైనికులకు సంఘీభావంగా ర్యాలీ



రేబాక గ్రామస్తుల ర్యాలీ

తుమ్మపాల: ఉగ్రవాదాన్ని అంత మొందించడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న దేశ సైనికులకు సంఘీభావంగా రేబాక గ్రామస్తులు ఆదివారం ర్యాలీ చేపట్టారు. మండలంలో రేబాక గ్రామంలో ప్రధాన జంక్షన్ నుంచి జైహింద్.. జై ఆపరేషన్ సిందూర్, జోహార్ మురళీనాయక్ అంటూ నినాదాలతో ఊరంతా జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. దేశం కోసం పోరాడి చిన్న వయస్సులోనే ప్రాణాలకు తెగించి వీరమరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరణం మాణిక్యాలరావు, మాజీ ఆర్మీ సైనికుడు ఎం.భాస్కరరావు, కోట సంతోష్, పచ్చికూర గాంధీ, కరణం నాయుడు, కోన నాయుడు, యువకులు పాల్గొన్నారు.

శారదా పీఠంలో యాగం ప్రారంభం



స్వామీజీల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న యాగం

పెందుర్తి: భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ రక్షణ, విజయం కోసం శారదా పీఠం తలపెట్టిన వజ్రిణీ స్కంద పాశుపత హనుమద్యాగం ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్ని సంస్కారం జరిపారు. అనంతరం స్కంద పాశుపత హోమం, చండీ నవార్ణ మహామంత్ర హోమం, దక్షిణామూర్తి స్వరూప సాంబ సదాశివ హోమం, వీరాంజనేయ హోమం వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు అంకురార్పణ చేశారు. ఈ నెల 22 హనుమత్ జయంతి వరకు ఈ క్రతువు కొనసాగుతుందని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర తెలిపారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎస్.రాయవరంలో ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. 1999–2000 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. పరస్పరం యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యనేర్పిన ఉపాధ్యాయులు ఎం.వెంకయ్య, వి.కొండలరావు, ఆర్.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, ఎస్.కల్యాణరావు, ఎల్.ఎస్. నాయుడులను సత్కరించారు.

ఘనంగా గంగమ్మతల్లి జాతర



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

కోటవురట్ల: సుంకపూరు గ్రామంలో గంగమ్మతల్లి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వేకువజాము నుంచి భక్తుల తాకిడి నెలకొంది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు మొదట గంగమ్మతల్లిని దర్శించుకుని పాడి పంటలతో అంతా సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. ఆ తర్వాత సంప్రదాయం ప్రకారం పావుకోళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి

అనకాపల్లి: స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.35 వేలు అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్మికులు అందరూ ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించాలని కోరారు. కార్మిక హక్కులను కాలరాసే ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సమ్మెను చేయడం జరుగుతుందన్నారు. భవన, ఆటో, ముఠా కార్మికులకు సమగ్రమైన సంక్షేమ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జంపెనలో ఆలయ వార్షికోత్సవం

మాడుగుల : మండలంలో జంపెన గ్రామంలో ఆదివారం మోదకొండమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మునగపాక బైపాస్ రోడ్డులో తప్పిన ప్రమాదం



మునగపాక బైపాస్ రోడ్డులో విరిగిన విద్యుత్ స్తంభం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులోని అమ్మపాల సెంటర్ సమీపంలో ఆదివారం ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాక బైపాస్ మీదుగా వాడ్రాపల్లికి వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌ను ఓ కారు ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ఎదురుగా సైకిల్ రావడంతో దాన్ని తప్పించే క్రమంలో ట్రాక్టర్‌ను వెనుక భాగాన్ని కారు ఢీకొంది. దీంతో ట్రాక్టర్ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో విరిగిపోయింది. దానితో పాటు మరో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సంబంధిత అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

• విరబూసిన మే పుష్పం



మునగపాక మెయిన్ రోడ్డు పక్కన గల అప్పలనాయుడు ఇంటి ఆవరణలో విరబూసిన మే పుష్పం అందరినీ ఆకట్టుకుంటోంది. అందంగా ఉన్న ఈ పుష్పాన్ని తిలకించేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. -మునగపాక

వరద నుంచి 'రక్షణ' ఏదీ



పంపానది ఒడ్డున వెంకటానగరం

పంపానదిని ఆనుకుని గోడ నిర్మించాలని వేడుకుంటున్న వెంకటానగరం గ్రామస్తులు

పాయకరావుపేట : పంపానదికి వరదొస్తే చాలు.. తీర ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది. నదిలో నీటిమట్టం పెరిగితే.. వారి గుండెల్లో గుబులు రేగుతుంది. పంపానది సముద్రంలో కలిసే చోట ఉన్న వెంకటానగరం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమను ముంపు ముప్పు నుంచి కాపాడేందుకు గ్రామానికి ఆనుకుని పంపానది ఒడ్డున రక్షణ గోడ నిర్మించాలని చాలా కాలంగా కోరుతున్నారు.

మండలంలోని వెంకటానగరం తీర ప్రాంత గ్రామం. ఈ గ్రామంలో సుమారు ఐదు వేల మంది జనాభా నివాసముంటున్నారు. అందరూ మత్స్యకారులే. గ్రామానికి ఆనుకుని పంపానది ప్రవహిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా అన్నవరం వద్దనున్న డ్యామ్ ద్వారా విడుదల చేస్తున్న నీరు పంపానది ద్వారా ప్రవహిస్తుంది. మండలంలోని కుమారపురం, రత్నయ్యమ్మపేట, రాజానగరం, రాజవరం గ్రామాల సమీపం నుంచి పంపానది ప్రవహిస్తూ వెంకటనగరం గ్రామం వద్ద సముద్రంతో అనుసంధానమైన ఉప్పుటేరులో కలుస్తుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు, అన్నవరం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేసేటప్పుడు నదిలో ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. వరదలు సంభవించే సమయంలో పంపానది పొంగిపొర్లుతుంది. దీంతో నదిని ఆనుకుని ఉన్న వెంకటానగరంలో నీరు ప్రవేశించి, ఇళ్లవాకిళ్లను ముంచేస్తుంది. వరదల సమయంలో గ్రామస్తులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. గ్రామానికి ఆనుకుని పంపానది ఒడ్డున రక్షణగోడ నిర్మించి వరద ముప్పు నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. గతంలో రక్షణ గోడ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపారని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాస్ తెలిపారు. అయితే ఇంతకు గోడను నిర్మించలేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన కోరారు.

గౌతమ బుద్ధుని జయంతి నేడు

దేవరాపల్లి : దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహంలో గౌతమ బుద్ధుని జయంతి(బుద్ధ పూర్ణిమ) కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు మండల అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు తెలిపారు. మండల అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.